# ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి

**సీపీ సునీల్ దత్**

వినతులు స్వీకరిస్తున్న సీపీ సునీల్ దత్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 26 : వివిధ సమస్యలపై బాధితులు చేస్తున్న ఫిర్యాదులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఎస్ హెచ్‌వోలను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 22 మంది బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదులను అందించారు. వాటిని పరిశీలించిన సీపీ చర్యలు తీసుకునేందుకు ఆయా పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఎక్కువగా వ్యక్తిగత, కుటుంబ సమస్యలతోపాటు ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల సమస్యలపై ఫిర్యాదు వచ్చాయని తెలిపారు.

# 'దియా' ఆగయా..

**శిక్షణ పూర్తి చేసుకున్న జాగిలాన్ని అభినందించిన ఎస్పీ**

జిల్లాకు కేటాయించిన జాగిలం దియాను అభినందిస్తున్న ఎస్పీ

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 26 : పేలుడు పదార్థాలను కొనుగొనడంలో ప్రత్యేక శిక్షణ పొందిన తర్వాత జిల్లాకు కేటాయించబడిన పోలీస్ జాగిలం దియాను జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. దియాకు హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ మహేందర్, ఇతర డాగ్ స్క్వాడ్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లా పోలీస్ శాఖలో పని చేస్తున్న 11 పోలీస్ జాగిలాలకు సంబంధించిన పూర్తి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాగిలాల సంరక్షణ, వసతి ఏర్పాట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ విజయ్‌బాబు, అడ్మిన్ ఆర్ఐ బోలెం రవి, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, హోం గార్డ్స్ ఆర్ఐ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

- సాగునీరు లేక నెర్రెలువారుతున్న వరి పొలాలు
- చరిత్రలో తొలిసారిగా కనిష్ఠంగా సాగు నమోదు
- ఏడారిగా మారిన నాగార్జున సాగర్ ఆయకట్టు
- మరోవైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు
- తగ్గిన ఉద్యాన సాగుతో కూరగాయల ధరలు ప్రియం
- తీవ్ర ఆందోళనలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అన్నదాతలు

నీరు లేక ఎండిపోయిన ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం చెరువు

# యాసంగి ఎండమావి

ఖమ్మం, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సాగు విస్తీర్ణంలో ఎప్పుడూ ముందుండే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఈసారి పూర్తిగా వెనుకబడింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ యాసంగి ఎండమావిని తలపిస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎన్నడూలేని విధంగా తొలిసారిగా పంటల సాగు విస్తీర్ణం కనిష్ఠంగా నమోదైంది. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటాయి. మరోవైపు ప్రస్తుత ప్రభుత్వ నిర్వాకం వల్ల ప్రధాన సాగునీటి వనరు అయిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎండిపోతోంది. ఫలితంగా దాని ఆయకట్టు అంతా ఎడారిగా మారింది. చుక్క సాగునీరు కూడా లేకపోవడంతో వరి పొలాలన్నీ నెర్రెలువారాయి. ఇంకోవైపు ఉద్యాన పంటల సాగు గణనీయంగా తగ్గడంతో కూరగాయల ధరలు ప్రియమవుతున్నాయి. ప్రధానంగా సాగునీరు లేకపోవడం, ఇప్పటికే వేసిన పంటలు ఎండిపోవడం వంటి కారణాలతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## వేసిన పంటలను కాపాడే దారేది?

సాగునీరు అందకపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే సాగు చేస్తున్న కొద్దిపాటి పంటలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుండడంతో, నీరులేక పొలాలు నెర్రెలువారుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పశువులకు మేతగా ఉపయోగిస్తున్నారు. ఇక వచ్చే నెలకు కనీసం తాగునీరు సైతం అందుబాటులో ఉంటుందా? అనే సందేహం మారుమూల గ్రామాల ప్రజలను వేధిస్తోంది. సాగర్ నీరు విడుదల కాకపోవడంతో జిల్లాలో సాగు గణనీయంగా తగ్గి కేవలం 1.50 లక్షల ఎకరాలకే పరిమితమైంది. బోర్లు, బావుల్లోనూ నీళ్లులేకపోవడంతో ఉద్యాన పంటల దిగుబడీ తగ్గింది. ఫలితంగా కూరగాయల ధరలు మరింత ప్రియమవుతున్నాయి.

## సాగు భూములు ఇలా..

జిల్లాలో వర్షాధారంతో సాగయ్యే భూములు కొన్ని ఉండగా.. ఇతర వనరుల కింద సాగయ్యే భూములు మరికొన్ని ఉన్నాయి. వీటిల్లో బోరుబావుల కింద 52,480 ఎకరాలు, చెరువుల కింద 56,005 ఎకరాలు, కాలువల కింద 2,39,986 ఎకరాలు, కుంటల కింద 95,843 ఎకరాలు, ఎత్తిపోతల పథకాల కింద మరో 15,865 ఎకరాలు సాగవుతున్నాయి. మొత్తంగా వివిధ సాగునీటి వనరుల ద్వారా వానకాలం సీజన్లలో సహజంగా 5,48,413 ఎకరాలు సాగు కావాల్సి ఉంటుంది. వీటితోపాటు కేవలం వర్షాధారంపై మరో 1,38,461 ఎకరాలు సాగవుతుంటాయి. యాసంగిలో ఇంచుమించుగా 3 లక్షల నుంచి 3.50 లక్షల ఎకరాలు సాగవుతుంటాయి. కానీ.. ఈసారి కేవలం 1.50 లక్షల ఎకరాల్లోనే యాసంగి పంటలు సాగవుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం 1,56,406 ఎకరాల్లో మాత్రమే రైతులు వివిధ పంటలను సాగు చేశారు. వీటిలో వరి 85,408 ఎకరాలు, మక్క 60,082 ఎకరాలు, పెసర 7,361 ఎకరాలు, చెరుకు 83 ఎకరాలు, వేరుశనగ 590 ఎకరాలు, మినుము 808 ఎకరాలు, కంది 135 ఎకరాలు, జొన్న 333 ఎకరాలు, ఇతర రకాలు మరో వెయ్యి ఎకరాల్లో మాత్రమే సాగవుతున్నాయి.

**గడిచిన ఐదేళ్లలో యాసంగి సాగు వివరాలు..**

| సంవత్సరం | సాగు విస్తీర్ణం (ఎకరాలు) |
|---|---|
| 2019-20 | 3,02,314 |
| 2020-21 | 3,37,450 |
| 2021-22 | 2,11,330 |
| 2022-23 | 3,15,375 |
| 2023-24 | 1,56,406 |

**గత ఐదేళ్ల నీటి లభ్యత వివరాలు ఇలా ఉన్నాయి**

| సంవత్సరం | నీటి లభ్యత (జిల్లా సగటు) మీటర్లలో |
|---|---|
| 2020-జనవరి | 4.93 |
| 2021-జనవరి | 3.83 |
| 2022-జనవరి | 4.56 |
| 2023-జనవరి | 4.46 |
| 2024-జనవరి | 5.46 |

### ఎడారిని తలపిస్తున్న సాగర్ ఆయకట్టు..

జిల్లాలోని 21 మండలాలకు గాను 16 మండలాలు సాగర్ ఆయకట్టు కిందే ఉన్నాయి. దీనికింద ఏటా వానకాలం సీజన్‌లో 3.50 లక్షల ఎకరాలు, యాసంగి సీజన్‌లో 1.60 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేస్తుంటారు. ఈసారి సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో ఆయకట్టు ప్రాంతమంతా ఎడారిని తలపిస్తోంది. అక్కడక్కడా పలువురు రైతులు పంటలు వేసినప్పటికీ నీరులేక అవి ఎండిపోయాయి.

### గడిచిన ఐదేళ్లలో భూగర్భ జలాల నిల్వలు ఇలా..

గడిచిన ఐదేళ్ల భూగర్భ జలాల గణాంకాలకు భిన్నంగా ఈసారి నీటి నిల్వలు మరింత కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఏటా జనవరిలో చేసే సర్వే ప్రకారం జిల్లాలో సగటున 4.46 మీటర్ల లోతులో నీటి లభ్యత ఉంటుంది. కానీ.. ఈ ఏడాది అది 5.46 మీటర్లకు పెరిగింది. సత్తుపల్లి, ఎర్రుపాలెం, సింగరేణి, కామేపల్లి, ఏన్కూరు వంటి మండలాల్లో భూగర్భ జలాలు మరింత తగ్గాయి. మార్చి నెల చివరి నాటికి ఇవి మరింత తగ్గే ప్రమాదముందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

### సాగులేక ప్రియమైన కూరగాయల ధరలు

సాగునీటి నిల్వల ప్రభావం ఉద్యాన పంటలపై పడింది. దీంతో కూరగాయల ధరలు ప్రియమవుతున్నాయి. ఈ ప్రభావం సామాన్యులపై ఎక్కువగా పడుతోంది. కూరగాయల సాగు 2021-22 యాసంగిలో 1,780 ఎకరాల్లో జరిగితే.. 2022-23లో అది 1883 ఎకరాలకు పెరిగింది. కానీ.. ప్రస్తుత 2023-24 సీజన్‌లో కేవలం 1,277 ఎకరాల్లోనే కూరగాయలు సాగవుతున్నాయి.

# భద్రాద్రి జిల్లాలోనూ అదే తీరు..

ఉప్పరిగూడెంలో బోరులో నీరులేక బీడుగా ఉన్న వరి పొలం

సింగభూపాలెం చెరువు కాలువలో నిలిచిపోయిన నీరు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : యాసంగి సాగు విషయంలో భద్రాద్రి జిల్లాలోనూ అదే తీరు కన్పిస్తోంది. జిల్లావ్యాప్తంగా నిరుడు 60 వేలకుపై చిలుకు ఎకరాల్లో యాసంగి సాగు జరుగగా.. సాగునీరు లేని కారణంగా అది ఈ ఏడాది కేవలం 36 వేల ఎకరాలకే పరిమితమైంది. రెండు లేదా మూడు ఎకరాల్లోపు వ్యవసాయ భూములున్న రైతులకు మినహా అంతకుమించిన విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్న రైతులకు రైతుబంధు సాయం ఇంకా అందలేదు. దీంతో చాలా మంది రైతులు యాసంగి సాగుకు మొగ్గు చూపలేదు. కొందరు రైతులు మాత్రం ధైర్యం చేసి పామాయిల్ సాగు వైపు మళ్లారు. ప్రత్యేకంగా పరిశీలిస్తే.. పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలంలో తుమ్మలచెరువు కింద నిరుడు 8,500 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. కానీ.. ఈ ఏడాది దానిని 4,200 ఎకరాలకే పరిమితం చేశారు. అలాగే, కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి సర్వారం గ్రామంలో పంట పొలాల్లో మోటర్లు ఉన్నా కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. నీరులేని కారణంగా ఒక రైతు టమాట తోట ఎండిపోయింది. అదే మండలం ఉప్పరిగూడెంలో హరి అనే మరో రైతు కూడా బోరులో నీరు లేని కారణంగా ఈసారి సాగు మానేశాడు. సింగభూపాలెం చెరువులో నీటిమట్టం తగ్గడంతో కాలువలోకి నీరు రావడం లేదు. దీంతో దాని ఆయకట్టు కింది అంజనాపురం రైతులు కూడా యాసంగిపై ఆసక్తి చూపలేదు.

### కరంటే సక్కంగ రావట్లేదు..



పంట వేయాలంటే 24 గంటలూ కరెంటు ఉండాలి. కానీ.. ఇప్పుడు కరెంటే సక్కంగ రావట్లేదు. ఎప్పుడు వస్తంతో ఎప్పుడు పోతందో తెలియట్లేదు. అందుకే ఈసారి పంట వేయలేదు. వానకాలంలో పత్తి వేశాం. అది చేతికొచ్చింది. దాన్ని తీసేసి యాసంగిలో కూరగాయలు సాగు చేద్దామంటే నీళ్ల సమస్య వస్తంది. కరెంటు సక్కంగుంటే కూరగాయల పంటలు వేసేవాళ్లం. కరెంటు రాకపోతే పంట ఎండిపోతదని ఈసారి బీడుగానే వదిలేశాం. కాలువలు, చెరువుల్లో కూడా నీళ్లు లేవు.

**-లావుడ్యా అనిల్, రైతు, సుజాతనగర్ మండలం, భద్రాద్రి జిల్లా**

# పది, ఇంటర్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 26 : జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 70 కేంద్రాల్లో 36,578 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని, 97 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుబ్బారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్, జడ్పీ సీఈవో వినోద్, డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభాకర్, ఏసీపీ సాంబయ్య, వైరా, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్లు సీహెచ్ వేణు, రవిబాబు, పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ బి.రవికుమార్, ఆర్‌టీసీ డివిజనల్ మేనేజర్, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే అర్జీలకు సత్వర పరిష్కారం

గ్రీవెన్స్ డేలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే(ప్రజావాణి)లో అర్జీదారుల నుంచి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

జిల్లాలో మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, విద్యా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వెల్ఫేర్ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 92,511 మంది 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించామని, 4,984 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. 26ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 30 అర్బన్ ప్రాంతాల్లో 252, రూరల్ ప్రాంతాల్లో 843, ట్రైబల్ ప్రాంతాల్లో 151 మొత్తం 1,246 కేంద్రాలు, 70 మొబైల్ పాయింట్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు బస్టాండ్, రైల్వేస్టేషన్, జన సమూహాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయాలని అధికారులకు సూచించారు. మార్చి 3వ తేదీ తర్వాత మిగిలిన చిన్నారులకు మరుసటి రోజు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సైదులు, డాక్టర్ ప్రమీల, డాక్టర్ ప్రశాంత్, జిల్లా పరిషత్ సీఈ వినోద్, డీఈవో సోమశేఖర్‌శర్మ, డీడీ సోషల్ వెల్ఫేర్ సత్యనారాయణ, టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు

**భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 26 : మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన రోడ్డు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. కొత్త దంతెనం పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తాలిపేరు కెనాల్ వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో 900 మీటర్ల గ్రావెల్ రోడ్డు, సీడీపీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన కొబ్బరికాయ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, ఉపాధ్యక్షులు తునికి కామేశ్, అపకా వీర్రాజు, సొసైటీ డైరెక్టర్ కాలువ పూర్ణయ్య, సోషల్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు దామెర్ల శ్రీనివాసరావు, తోట రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోతుకూరి శ్రీకాంత్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు కొత్తా మల్లేశ్వరరావు, బీసీ సెల్ కార్యదర్శి బొల్లి శేఖర్, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు పొడియం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకే 'సైన్స్ ఫెయిర్'

**డీఈవో వెంకటేశ్వరచారి**

సైన్స్ ఫెయిర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

చంద్రుగొండ, ఫిబ్రవరి 26 : విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు సైన్స్ ఫెయిర్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని డీఈవో వెంకటేశ్వరచారి అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలస్థాయి హెచ్ఎంల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 28న అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయని, ప్రతి విభాగంలో మూడు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎర్రగుంట పాఠశాల పూర్వ విద్యార్థులు తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి చలపతిరావు, ఎంఈవో సత్యనారాయణ, ఎర్రగుంట పాఠశాల హెచ్ఎం ఆనంద్‌కుమార్, తొలి అడుగు ఫౌండేషన్ నిర్వాహకుడు రాము, హెచ్ఎంలు పాల్గొన్నారు.

# 'పల్స్ పోలియో'ను సక్సెస్ చేయాలి

**భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల**

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య శాఖ, వివిధ శాఖల జిల్లా అధికారులతో పల్స్ పోలియోపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 3న నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 97,522 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు వంద శాతం పోలియో చుక్కలు వేయాలన్నారు. పలు కారణాలతో మిగిలిపోయిన చిన్నారులకు 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 925 పోలియో కేంద్రాలు, 38 సంచార పోలియో టీములు, 33 ట్రాన్సిట్ టీంలను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో శిరీష కలెక్టర్‌కు వివరించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఆదేశించారు. పల్స్ పోలియోపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో రవీంద్రనాథ్, డీఆర్‌డీవో విద్యాచందన, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 26 : ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్వంచ మండలం జగ్గుతండాకు చెందిన బాధితులు, ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన ఉపేందర్‌రావు, బండారి శ్రీనివాసరావు, మణుగూరుకు చెందిన కాంట్రాక్టర్ వేముల లక్ష్మయ్య తదితరులు తమ దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో రవీంద్రనాథ్, డీఆర్‌డీవో విద్యాచందన పాల్గొన్నారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

**ఖాళీ బిందెలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**

వేంసూరు, ఫిబ్రవరి 26: తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. ఈ మేరకు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వేంసూరు పంచాయతీ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల వాసులు మంచినీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సీపీఐ అనుబంధ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం వేంసూరులో ఖాళీ బిందెలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ.. మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు గాను సుమారు 15 పంచాయతీల్లో మంచినీటి సమస్య ఉందని అన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా డబుల్ బెడ్ రూం ఇళ్లవాసులు నీళ్ల కోసం 2 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రీయల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కేటీపీఎస్ విజయం

క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ

పాల్వంచ, ఫిబ్రవరి 26 : జిల్లా ఇండస్ట్రీయల్ క్రికెట్ టోర్నమెంట్ అశ్వాపురం హెవీవాటర్‌ప్లాంట్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరిగింది. ఈ పోటీల్లో సింగరేణి, నవభారత్, కేటీపీఎస్ 5,6,7 దశలు, మణుగూరు బీటీపీఎస్, ఐటీసీ సారపాక, హెవీ వాటర్‌ప్లాంట్ జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌లో కేటీపీఎస్ 7వ దశ క్రికెట్ క్రీడాకారులు మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. టోర్నమెంట్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎండీ ఆరిఫ్, ఎం.శ్రీనివాస్, రమేష్, నరసింహారావు, మహేష్, వివేక్, రంగానాయక్, జి.లక్ష్మణ్‌రావు, ఎండీ ముక్తార్ అహ్మద్, బాను మహేష్, రమేష్, శ్రీనివాస్, రాహుల్, భరత్‌కుమార్, సతీష్‌కుమార్, డి.మహేష్‌లను సీఈ వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎస్ఎన్ఎస్ శేఖర్, వై.వెంకటేశ్వర్లు, శేఖర్, వై.వెంకటేశ్వర్లు, ఎన్ఎల్‌కే ప్రసాద్‌లు పాల్గొన్నారు.